క్లుప్తంగా

ఘనంగా విజయదుర్గాదేవి వార్షికోత్సవం


వాకలగరువులో వేంచేసిన విజయదుర్గాదేవి

అంబాజీపేట: వాకలగరువు శివారు రజకపేటలో కొలువుదీరిన విజయదుర్గాదేవి మూడో వార్షికోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. అర్చకులు చంద్రమౌళీ లక్ష్మీనారాయణశర్మ పర్యవేక్షణలో కొత్తపల్లి వెంకన్నబాబు, దంపతులు, కొత్తపల్లి వీవీ సత్యనారాయణ దంపతులు, తలుకుల పెద్దిరాజు దంపతులు, శ్రీరామచంద్రమూర్తి దంపతులు, కొత్తపల్లి ప్రకాష్ దంపతులు, రజక సంఘం ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేకువజాము నుంచి అమ్మవారికి మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని కుంకుమ పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాంగణం వద్ద ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నసమారాధన నిర్వహించారు.

కమ్యూనిటీ భవన నిర్మాణానికి భూమి పూజ


చినపేటలో భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు

మలికిపురం: మండలంలోని రామరాజులంక గ్రామం చినపేటలో నూతనంగా నిర్మిస్తున్న కమ్యూనిటీ భవనం నిర్మాణం, అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటు పనులకు ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు బుధవారం భూమి పూజ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గ్రామాభివృద్ధికి ప్రభుత్వ పరంగా సహకరిస్తానని చెప్పారు. కార్యక్రమంలో సర్పంచ్ కాకర శ్రీనివాస్, మేడిచర్ల రాము, ఎంపీటీసీ మేడిచర్ల వెంకట్రాజు, సొసైటీ చైర్మన్ చొప్పల రాజేశ్వరరావు, దేశినీడి ఉదయ భాస్కరరావు, నల్లి శివకుమార్, చింతా రాజబాబు, యూత్ అధ్యక్షుడు చొప్పల శ్రీను, చొప్పల రాజశేఖర్, ఈద శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

వీల్ చైర్ బహూకరణ


చిట్టిబాబుకు వీల్ చైర్ అందిస్తున్న సంస్థ సభ్యులు

మలికిపురం: మండలంలోని గొల్లపాలెం గ్రామానికి చెందిన కొల్లాబత్తుల చిట్టిబాబు ప్రమాదవశాత్తూ గాయపడి నడవలేని స్థితిలో ఉన్నాడు, చిట్టుబాబుకు హెల్ప్ ది నీడ్స్ కువైట్ ఎన్నారై సంస్థ వీల్ చైర్ బహూకరించింది. బుధవారం గ్రామంలో ఈ మేరకు వీల్ చైర్‌తో పాటు కొంత నగదు కూడా అందించారు. కార్యక్రమంలో కొల్లాబత్తుల అశోక్‌కుమార్, మాజీ ఎంపీటీసీ సభ్యులు గుండుమేను నారాయణమూర్తి, కందుల విజయకుమార్, దిడ్ల చిన్న, పితాని శ్రీను తదితరులు పాల్గొని దాతలను అభినందించారు.

ఉన్నత పాఠశాలకు కలర్ ప్రింటర్ అందజేత


కలర్ ప్రింటర్‌ను అందజేస్తున్న రామగంగా ట్రస్టు ప్రతినిధులు

మామిడికుదురు: పాశర్లపూడికి చెందిన రామగంగా ట్రస్టు ప్రతినిధులు మామిడికుదురు జెడ్పీ ఉన్నత పాఠశాలకు బుధవారం కలర్ ప్రింటర్ అందించారు. యెరుబండి సత్యవర్ధనరావు మెమోరియల్ భవనంలో జరిగిన సమావేశంలో ట్రస్టు నిర్వాహకుడు బొక్కా సత్యనారాయణమూర్తి ఆధ్వర్యంలో దీన్ని స్కూల్ హెచ్ఎం సీహెచ్ నిరంజనికి అందించారు. ట్రస్టు నిర్వాహకుడు మాట్లాడుతూ మండలంలోని పలు స్కూళ్లతో పాటు అల్లవరం స్కూల్‌కు రూ.2 లక్షలతో కలర్ ప్రింటర్లు అందిస్తున్నామన్నారు. అనంతరం కాకినాడకు చెందిన పడాల చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో కౌమార బాలికలకు అవగాహన సదస్సు జరిగింది. బాలికలు తీసుకోవల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సైంటిస్ట్ నయినాల వేణుగోపాల్, రిటైర్డ్ హెచ్ఎం మైలవరపు రవీంద్రనాథ్, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చట్టపరమైన చర్యలు తీసుకోవాలి

ఆలమూరు: హైదరాబాద్ తెలుగు విశ్వ విద్యాలయంలో మను శిక్షాస్మృతి గ్రంథాన్ని ఆవిష్కరించడం రాజ్యాంగ వ్యతిరేకమని మండలంలోని వివిధ దళిత సంఘాలు ఆరోపించాయి. ఈ మేరకు తహసీల్దార్ జేడీ కిషోర్‌బాబుకు బుధవారం వినతిపత్రాన్ని అందజేశారు. దళితులకు వ్యతిరేకంగా ఉన్న ఈ గ్రంథాన్ని ఆవిష్కరించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

శివరాత్రికి ముస్తాబవుతున్న శైవాలయాలు

- ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు
- నేడు పలు ఆలయాల్లో స్వామి కల్యాణాలు

ఆత్రేయపురం: ఈనెల 18న మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించే నిమిత్తం శివాలయాలను రంగురంగుల విద్యుత్ దీపాలు అలంకరించి ముస్తాబు చేస్తున్నారు. అధిక సంఖ్యలో భక్తులు ఆయా ప్రాంతాల్లో శివాలయాల్లో దర్శనానికి వస్తారని దేవదాయ ధర్మదాయ శాఖ అందుకు తగిన ఏర్పాట్లు చేయడానికి ఆలయాల ఈఓల ఆధ్వర్యంలో సన్నాహాలు ప్రారంభించారు. మండలంలోని ఆత్రేయపురం, ర్యాలి, వాడపల్లి, వసంతవాడ తదితర గ్రామాల్లో మహాశివరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. ముఖ్యంగా పురాణ ప్రసిద్ధి చెందిన ర్యాలిలో వేంచేసిన ఉమా కమండలేశ్వర స్వామి ఆలయానికి అధిక సంఖ్యలో భక్తులు విచ్చేసి ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. ఈ ఆలయం ఎంతో ప్రాచీనమైందని క్రీ.శ 11వ శతాబ్దంలో ఈ ఆలయం నిర్మించినట్టు సమాచారం. ఈ క్షేత్రం విశేషం తూర్పు వైపు జగన్మోహినీ కేశవ స్వామి, పడమర వైపు శివాలయం ఉంది. ఇది ర్యాలి క్షేత్రంలో మాత్రమే ఉంటుంది. బ్రహ్మ తన కమండలంపై ఉమతో కూడిన ఈశ్వరుడిని ప్రతిష్ఠించాడని అందుకే ఆలయాని ఉమా కమండలేశ్వర స్వామి ఆలయంగా నామకరణం చేశారని పురాణాలు చెబుతున్నాయి. ర్యాలి ఆలయాలల్లో మరో విశేషం ఏమిటంటే జగన్మోహినీ కేశవస్వామి ఆలయంలో స్వామి వారి పాదాల నుంచి గంగ ఉద్భవించడం, శివాలయంలో గంగ హరించుకుపోవడం భక్తులను ఆశ్చర్యానికి గురి చేస్తుంది. అలాగే మండల కేంద్రం ఆత్రేయపురంలో బాలత్రిపుర సుందరీ రాజరాజేశ్వరస్వామి, రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాల స్వామి ఆలయం, అలాగే వసంతవాడ పార్వతీ పరమేశ్వర స్వామి ఆలయం ఈ ఆలయాన్ని ఏడు శుక్రవారాలు వచ్చి దర్శించుకుంటే కోరికలు నెరవేరతాయని భక్తులు నమ్మకం.


ఏకపీఠంపై పలివెల ఉమా కొప్పేశ్వరస్వామి


ప్రత్యేక అలంకరణలో జగన్మోహినీ కేశవస్వామి

పురాణ ప్రసిద్ధ పుణ్యస్థలం.. ఉమా కొప్పేశ్వర క్షేత్రం

కొత్తపేట: జిల్లాలో పురాణ ప్రసిద్ధి చెందిన శివాలయాల్లో కొత్తపేట మండలం పలివెల ఉమా కొప్పేశ్వరస్వామి క్షేత్రం ఒకటి. అగస్త్యేశ్వర మహాముని కోరిన మేరకు శివపార్వతులు ఏకపీఠంపై కొలువు దీరడం ఈ క్షేత్రంలో ఒక విశేషమైతే, పరమశివుని మహాభక్తుడైన పూజారి ప్రాణాలు నిలిపేందుకు శివుడు కొప్పు ధరించిన వైనం మరో విశేషం. అందుకే ఈ క్షేత్రంలో శివలింగానికి ముందు బాగంలో కొప్పు వుంటుంది. ఈ క్షేత్రంలో మహాశివరాత్రి మహోత్సవాలు ఘనంగా జరుగుతాయి. ఆ మేరకు ఎంపీపీ మార్గన గంగాధరరావు పర్యవేక్షణలో దేవస్థానం ఉత్సవ కమిటీ చైర్మన్ భమిడిపాటి దుర్గాలక్ష్మీనారాయణ, కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ఈఓ నడింపల్లి ప్రసాదరాజు, సిబ్బంది గురువారం నుంచి శివరాత్రి ఉత్సవాలకు ఏర్పాట్లు చేశారు. 6 రోజుల పాటు పంచాహ్నిక ధ్వజారోహణ దీక్షతో దివ్య కళ్యాణ మహోత్సవాలు వైభవంగా జరగనున్నాయి. గురువారం రాత్రి 3.45 గంటలకు (తెల్లవారితే శుక్రవారం) స్వామి వారి కల్యాణోత్సవానికి, 18న మహాశివరాత్రి సందర్భంగా స్వామికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, దర్శనానికి, మధ్యాహ్నం 3.30 గంటలకు రథోత్సవానికి ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

నేడు ఉమా శనైశ్చరుల కల్యాణం

శనిదోష నివారణకు ప్రసిద్ధి చెందిన మందపల్లి ఉమా మందేశ్వర (శనైశ్చర) క్షేత్రంలో మహాశివరాత్రి పురస్కరించుకుని ఉమా మహేశ్వరుల వార్షిక కల్యాణం, మహాశివరాత్రి మహోత్సవాలు బుధవారం సాయంత్రం అంకురార్పణతో ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈఓ సింగం రాధ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. ఈ క్షేత్రంలో వేంచేసిన ఉమా మందేశ్వర (శనైశ్చర) స్వామి, ఉమా బ్రహ్మేశ్వరస్వామి, ఉమా నాగేశ్వరస్వామి వార్లకు గురువారం అభిషేకాలు, పూజలు, ప్రత్యేక కుంకుమార్చనలు, రాత్రి 9.30 గంటలకు స్వామి, అమ్మవార్ల కళ్యాణోత్సవం వైభవంగా నిర్వహించనున్నారు. ఆ మేరకు అన్ని ఏర్పాట్లు చేసినట్టు ఈఓ తెలిపారు.

ఏర్పాట్ల పరిశీలన

అయినవిల్లి: మండలంలోని ముక్తేశ్వరం రేవు తొగరపాయ వద్ద శివరాత్రి ఏర్పాట్లను ఎంపీడీఓ టీ.వీ ఆచార్య, జెడ్పీటీసీ సభ్యుడు గన్నవరపు గన్నవరపు శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ నాయకుడు మట్టపర్తి వెంకటరమణ తదితరులు పరిశీలించారు. శివరాత్రికి ఈ నదీ పాయ వద్దకు అధిక సంఖ్యలో భక్తులు తరలివస్తారు. అందుకు తగ్గట్టు ఇక్కడ ఏర్పాట్లు చేస్తున్నారు. మహిళలు దుస్తులు మార్చుకునేందుకు వీలుగా టెంట్లు, షామియానాలు మొదలైన సదుపాయాలను కల్పిస్తున్నారు. భక్తులు ఇబ్బందులు ఎదుర్కోకుండా తాత్కాలికంగా మరుగుదొడ్లు నిర్మిస్తున్నారు. అలాగే ముక్తేశ్వరం క్షణ ముక్తేశ్వరం ఆలయం వద్ద ఆలయ అధికారులు భక్తుల రద్దీకి అనుగుణంగా బారికేడ్లు నిర్మించారు.

ఎడ్ల పరుగు పందేలకు సర్వం సిద్ధం

ఆలమూరు: రాష్ట్ర స్థాయి ఎడ్ల పందాల పోటీలకు మండలంలోని గుమ్మిలేరు సర్వం సిద్ధమైంది. ఇప్పటికే రాష్ట్రం నలుమూలల నుంచి సుమారు 32 జతల ఎద్దులు గ్రామానికి చేరుకోగా నిర్వాహకులు తగిన వసతులు కల్పించారు. జూనియర్, సీనియర్ విభాగాల్లో నిర్వహించనున్న ఈ పోటీల్లో గెలుపొందిన విజేతలకు నగదు బహుమతులతో పాటు మెమెంటోలు బహూకరించనున్నారు. జూనియర్ విభాగంలో ఏడు జతలు, సీనియర్ విభాగంలో 25 జతలు పాల్గొననున్నాయి. సుదీర్ఘకాలంగా ఎదురు చూస్తున్న ఈ ఎడ్ల పోటీలు గురువారం జరగుతుండటంతో సర్వత్రా ఆసక్తి నెలకొంది.

క్రికెట్ పోటీలు ప్రారంభం

అయినవిల్లి: స్థానిక ముక్తేశ్వరం వైవీఎస్ అండ్ బీఆర్ఎం కళాశాలలో బుధవారం అప్పారి నాగభూషణం మెమోరియల్ ఆధ్వర్యంలో క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభమైంది. పోటీలను మండల విద్యాశాఖ అధికారి జేవీకే దుర్గ ప్రారంభించారు. 18వ తేదీ వరకూ ఈ పోటీలు జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో కళాశాల రెసిడెన్షియల్ డైరెక్టర్ వై.కుమారస్వామి, ప్రిన్సిపాల్ మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

సత్రం స్థలాన్ని పరిరక్షించండి

అంబాజీపేట: ముక్కామల గ్రామంలో ఉన్న నెంబర్ వన్ సత్రం స్థలాన్ని పరిరక్షించాలంటూ పోలీసులకు ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసిందని సత్రం ఫ్యామిలీ ఫౌండర్ సభ్యుడు బచ్చు గుప్తా తెలిపారు. ఈ మేరకు హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులను అంబాజీపేట పోలీసులకు నేరుగా గుప్తా బుధవారం అందజేశారు. హైకోర్టు ఆదేశాల మేరకు స్థానిక ఎస్సై ఎ.చైతన్యకుమార్ సత్రం స్థలాన్ని పరిశీలించారు. కాగా హైకోర్టు ఉత్తర్వు కాపీలను జిల్లా, మండల అధికారులకు పోస్టు ద్వారా పంపనున్నట్లు గుప్తా తెలిపారు. 1957లో తన తండ్రి విశ్వనాథం నెంబర్ వన్ సత్రం సంస్థకు చెందిన భవనాన్ని గత ఏడాది డిసెంబర్ 10, 11 తేదీలో కూల్చివేశారన్నారు. దాంతో అధికారులను ఆశ్రయించిన ఫలితం లేకపోవడంతో హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశామన్నారు. సత్రం స్థలం డోర్ నెం.1-31/2కు చెందిన 480 చదరపు గజాల స్థలానికి రక్షణ కల్పించాలంటూ పోలీసులకు సూచిస్తూ హైకోర్టు న్యాయమూర్తి ఆదేశించారని గుప్తా తెలిపారు.

ఘనంగా లక్ష తులసి పూజ

ఆలమూరు: గ్రామంలో వేంచేసిన శ్రీ, భూ సమేత జనార్దనస్వామి ఆలయంలో బుధవారం లక్షతులసి పూజ జరిగింది. ఆలయ పురోహితులు సూర్యనారాయణాచార్యుల నేతృత్వంలో అర్చక బృందం వేద పండితులు పాలమూరి మధ్వాచార్యుల మంత్రోచ్చరణల మధ్య ఈ పూజలు జరిగాయి. పరిసర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు వచ్చి ఈ పూజను తిలకించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

రావులపాలెం: 33 కేవీ విద్యుత్ లైన్ల మరమ్మతుల నిమిత్తం రావులపాలెం, ఈతకోట, ఊబలంక, గోపాలపురం విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధిలో గురువారం ఉదయం తొమ్మిది గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకూ విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎం.రవికుమార్ బుధవారం తెలిపారు. మండలంలోని వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

35 మంది గురువులకు పాద పూజ


అంబాజీపేటలో గురువులకు పాద పూజ చేస్తున్న భక్తులు

అంబాజీపేట: గురుసేవా విశిష్ట విమలాంబ వీరవరపు సుబ్బాయమ్మ గురు మాతాజీ ప్రథమ వార్షికారాధనలో భాగంగా అంబాజీపేట శివారు కుమ్మరిపాలెంలో గురువారం 35 మంది గురువులకు పాద పూజ చేశారు. విశాఖపట్నం, పైడికొండ గ్రామంలో ఉన్న శివరామ దీక్షితుల పీఠంలో చిన్న తనం నుంచి ఆధ్యాత్మిక చింతనలో ఉంటూ రాష్ట్ర నలుమూలల పర్యటించి ఎంతో మంది శిష్యులను, భక్తులను సంపాదించుకున్నారని అమ్మగారి కుటుంబ సభ్యులు, శిష్యబృందం తెలిపారు. అనంతరం భారీ అన్నసమారాధన నిర్వహించారు. తొలుత మాతాజీ చిత్రపటం వద్ద ప్రత్యేక పూజలు చేశారు.

మండల పరిషత్ బడ్జెట్ సమావేశం



కొత్తపేట మండల పరిషత్ సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ గంగాధరరావు

కొత్తపేట: మండల ప్రజా పరిషత్ 2023-24 ఆర్థిక సంవత్సరం బడ్జెట్ సమావేశం బుధవారం జరిగింది. ఎంపీపీ మార్గన గంగాధరరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎమ్మెల్సీ ఎన్నిక కోడ్ అమలులో ఉన్నందున ఈసారి మండల పరిషత్ సమావేశాన్ని అజెండా ప్రస్తావన లేకుండా కేవలం బడ్జెట్ ఆమోదించి ముగించారు. గడచిన ఆర్థిక సంవత్సరం ఆదాయ, ఖర్చులు, రాబోయే ఆర్థిక సంవత్సరం ఆదాయం, ఖర్చుల అంచనా బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. 2021-22 సంవత్సరానికి మొత్తం పద్దుల ఆదాయం రూ.26,17,10,136 కాగా 2022-23 సంవత్సరానికి మొత్తం వ్యయం రూ.26,16,46,428 పోను రూ.63,708 మిగులు బడ్జెట్‌గా చూపారు. 2022-23 ఆర్థిక సంవత్సరం అన్ని పద్దుల ఆదాయం రూ.27,22,83,610 కాగా 2023-24 ఆర్థిక సంవత్సరం అన్ని పద్దుల వ్యయం రూ.27,20,38,912 పోను రూ. 2,44,698 మిగులు అంచనాగా చూపారు. ఈ బడ్జెట్‌ను సమావేశం ఏకగ్రీవంగా ఆమోదించింది. సమావేశంలో జెడ్పీటీసీ సభ్యురాలు గూడపాటి రమాదేవి, వైస్ ఎంపీపీ దంగేటి వెంకటనాగమణి, సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షుడు నెల్లి లక్ష్మీపతిరావు, ఎంపీడీఓ ఈ.మహేశ్వరరావు, పలువురు ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

కలెక్టర్ ఆదేశాలతో కాజ్‌వే పరిశీలన


ఏటిగట్టు దిగువన ఉన్న కాజ్‌వేను పరిశీలిస్తున్న అధికారుల బృందం

మామిడికుదురు: గోదావరి వరదలకు ఏటా ముంపుబారిన పడుతున్న మామిడికుదురు శివారు కొర్లగుంట ఏటిగట్టు దిగువన ఉన్న కాజ్‌వేను అధికారుల బృందం బుధవారం పరిశీలించింది. జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా ఆదేశాల మేరకు జెడ్పీటీసీ కొరెడ్డి ఆంజనేయులుతో పాటు అధికారుల బృందం కాజ్‌వేను పరిశీలించింది. అక్కడ ముంపు సమస్యపై చర్చించారు. సిమెంట్ కాంక్రీట్ రోడ్డుకు అనుగుణంగా కాజ్‌వేను ఆధునీకరించాలని ప్రతిపాదించారు. దీనిపై జెడ్పీటీసీ ఆంజనేయులుతో అధికారులు చర్చించారు. కాజ్‌వే ఆధునీకరణ పనులు చేపడతామని, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్న అదే సమయంలో ట్రాఫిక్‌ను మళ్లించేందుకు అప్రోచ్ రోడ్డు నిర్మించే బాధ్యతను మీరే చూసుకోవాలని అధికారులు స్పష్టం చేశారు. కాజ్‌వేను ఆధునీకరించి ముంపు సమస్యను పరిష్కరించాలని అప్రోచ్ రోడ్డు ఏర్పాటు చేసే బాధ్యత తాము చూసుకుంటామని జెడ్పీటీసీ హామీ ఇచ్చారు. ఈ కాజ్‌వే ఆధునీకరణకు నోచుకోవడం ద్వారా మూడు లంక గ్రామాల ప్రజలకు ముంపు సమస్య నుంచి కొంత వరకు విముక్తి లభిస్తుంది. ఇదే అంశంపై అధికారులు స్థానికులతో చర్చించారు.

ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి


విఘ్నేశ్వర పూజతో ఉచిత శిక్షణను ప్రారంభించిన ఎమ్మెల్యే చిట్టిబాబు

మామిడికుదురు: బ్యాంకర్ల గ్రామీణ మరియు ఔత్సాహికుల అభివృద్ధి సంస్థ సౌజన్యంతో మహిళలకు ఏర్పాటు చేసిన మగ్గం మరియు జర్దోసి ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు సూచించారు. మొగలికుదురులోని జగ్గన్నపేట సత్యసాయి కల్యాణ మంటపంలో ఏర్పాటు చేసిన ఉచిత శిక్షణను ఎమ్మెల్యే బుధవారం ప్రారంభించారు. సమావేశంలో చిట్టిబాబు మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా స్వయం సమృద్ధి సాధించే దిశగా ఉచిత శిక్షణను ఏర్పాటు చేశామన్నారు. మహిళలకు ఆర్థికంగా చేయూతనందించి వారిని ప్రభుత్వం అన్ని విధాలుగా ప్రోత్సహిస్తోందన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని అభిలషించారు. 40 రోజుల పాటు మహిళలకు ఇక్కడ ఉచితంగా శిక్షణ ఇస్తారని చెప్పారు. చేనేత కార్మికులు ఎక్కువగా ఉండే ఈ గ్రామాన్ని శిక్షణ కొరకు ఎంపిక చేశామన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ డైరెక్టర్ పి.సంధ్యారాణి, సత్యసాయి సేవాల సంస్థల జిల్లా అధ్యక్షుడు అడబాల కొండబాబు, ఎస్బీఐ మేనేజర్ ఎంఆర్‌బీఆర్ గోపాలం, యూనియన్ బ్యాంక్, ఇండియన్ బ్యాంక్ మేనేజర్లు యు.రాజు, పి.మహేష్ బాబు, జోనల్ కన్వీనర్ జి.ప్రభాకర్, కె.ప్రభాకర్, ఎం.నరసింహారావు, నెక్కంటి లక్ష్మి, కె.నాగప్రసాద్, కడి శ్రీను పాల్గొన్నారు.

25 నుంచి లక్ష్మీవేంకటేశ్వరుని బ్రహ్మోత్సవాలు

ఆలయ నిర్మాత రమణరాజు ఆధ్వర్యంలో ఏర్పాట్లు ప్రారంభం


ప్రత్యేక అలంకరణలో శ్రీలక్ష్మీవేంకటేశ్వరస్వామి

ఆత్రేయపురం: గ్రామంలో వేంచేసిన లక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామి వారి బ్రహ్మోత్సవాలను ఈనెల 25 నుంచి మార్చి 1 వరకు వైభవంగా నిర్వహించడానికి ఏర్పాట్లు ప్రారంభించినట్లు ఆలయ నిర్మాత పాతపాటి వెంకట సత్యనారాయణరాజు(రమణరాజు) కుటుంబ సభ్యులు తెలిపారు. ఈనెల 18 నుంచి గోవింద మాలధారులు దీక్షలు ప్రారంభించి మార్చి 1 వరకు కొనసాగిస్తారన్నారు. ఆలయ కమిటీ సహాయ సహకారాలు అందిస్తారన్నారు. స్వామి వారి బ్రహ్మోత్సవ ఆహ్వాన పత్రికను స్వామి వారి చెంత ఉంచి ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు అందజేశారు. బ్రహ్మోత్సవాలు పురస్కరించుకుని 25న ఉదయం సంకల్పం, విష్వక్సేనణపూజ, పుణ్యాహవాచనం, దీక్షాధారణ, అకల్మష హోమం, దిగ్దేవతా ప్రార్థన, సాయంత్రం పుట్టమన్ను తెచ్చుట, అగ్నిమథనం, అగ్ని ప్రతిష్ఠాపన, వాస్తుపూజ, వాస్తు హోమం, శేషవాహన ఉత్సవం జరుగుతాయన్నారు. 26న స్వామికి సంకల్పం, విష్వక్సేన పూజ, పుణ్యాహవాచనం, విశేష హోమం, ఎదురు కోలోత్సవం, కల్యాణోత్సవం, హనుమత్ వాహోత్సవం, 27న చతుర్దశ కలశారాధన, పంచామృతాభిషేకం, మహిళలతో సామూహిక లక్ష కుంకుమార్చన, సాయంత్రం 108 తామర పువ్వులతో మహాలక్ష్మి హోమం అనంతరం సింహ వావానంపై ధార్మిక ఉత్సవాలు, 28న మహాసుదర్శన అభిషేకం, హోమం, శంకుచక్రనామర్చన, సహస్ర దీపాలంకరణ, ఉజ్వల సేవ, రాత్రి గరుడ వాహనోత్సవం, మార్చి 1న మహాశాంతి హోమం, శ్రీవారి చక్రస్నానం, నదీ తీరంలో చక్రతీర్థ స్నానం దీక్షా విసర్జన, ధ్వజారోహణం, భారీ అన్నసమారాధన, పల్లకి ఉత్సవం, స్వామి వారి పుష్పయాగం, ఏకాంత సేవా దర్శనం, తదితర పూజలు ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. పశ్చిమ గోదావరి జిల్లా పెనుగొండకు చెందిన వైఖానస మహదాచార్య శ్రీమాన్ ఖండవల్లి సూర్యానారాయణాచార్యులు (రమణబాబు) సుదర్శనం సూర్య పురుషోత్తమ సాయి పర్యవేక్షణలో టీటీడీ వేదపండితుల బృందం సభ్యులు ఆధ్వర్యంలో స్వామి వారి బ్రహ్మోత్సవాలు వైఖానస ఆగమ శాస్త్రం ప్రకారం వైభవంగా నిర్వహిస్తున్నట్లు వెంకట సత్యరాజ్యలక్ష్మి చారిటబుల్ ట్రస్టు చైర్మన్ (రమణరాజు) తెలిపారు. విశేష పూజల్లో పాల్గొనే భక్తులు కల్యాణం, నిత్య ఆర్జిత సేవలు, హోమాలు ముందుగా గోత్రనామాలతో ఆలయంలో పేర్లు నమోదు చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో పాల్గొనే భక్తులు రూ.1116 నగదు చెల్లించాలన్నారు. మరిన్ని వివరాలకు 9848982878కు సంప్రదించాలని కోరారు.

మల్లన్నకు పాగ మూరల సమర్పణ


కె.పెదపూడిలో పాగ మూరలతో గ్రామోత్సవం చేస్తున్న అమరేశ్వరరావు దంపతులు

అంబాజీపేట: మహా శివరాత్రి పరమదినాన్ని పురస్కరించుకుని ప్రముఖ శైవ క్షేత్రమైన శ్రీశైల భ్రమరాంబికా సమేత మల్లికార్జున స్వామికి సమర్పించే పాగ మూరలను కె.పెదపూడిలో బుధవారం గ్రామోత్సవం నిర్వహించారు. ఈ గ్రామానికి చెందిన గుమ్మడి అమరేశ్వరరావు దంపతులు గత ఆరు నెలల నుంచి భక్తి శ్రద్ధలు, నియమ నిష్టలతో 365 మూరల పాగాలను ప్రత్యేకంగా మగ్గంపై నేశారు. శివరాత్రి రోజున శ్రీశైల క్షేత్రంలో అష్టనందులను సంధానం చేస్తూ మల్లన్నకు ఈ పాగాను చుట్టిన తరువాత కల్యాణం జరిపిస్తారని అమరేశ్వరరావు దంపతులు తెలిపారు. నేడు తాము బయలుదేరి శ్రీశైలం వెళ్లి పాగాలను స్వామికి సమర్పిస్తామన్నారు. కార్యక్రమంలో చింతా శంకరమూర్తి, చింతా లింగం దంపతులు, అత్తిలింగం దంపతులు పాల్గొన్నారు.

బాధితులకు ఎమ్మెల్యే ఆర్థిక సాయం


అగ్నిప్రమాద బాధితులకు సాయం అందిస్తున్న జగ్గిరెడ్డి

ఆలమూరు: మండలంలోని మడికిలో జరిగిన అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయిన బాధిత కుటుంబాలను కొత్తపేట ఎమ్మెల్యే జగ్గిరెడ్డి బుధవారం పరామర్శించారు. బాధితులైన జాస్తి బాబూరావు, ఇందిర దంపతులను పరామర్శించి ప్రమాదానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా ఆయన రూ.15 వేలు ఆర్థికసాయం, నిత్యావసరాలు, 50 కేజీల బియ్యాన్ని అందజేశారు. అలాగే ప్రభుత్వపరంగా సాయాన్ని అందేలా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. వైఎస్సార్ సీపీ నాయకులు చెల్లుబోయిన శ్రీనివాసు, ఉంగ్రా సపు సుందరం విజయం ఆర్ఐ ఎం.జానకి రాఘవ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయిలో రాణించాలి

అంబాజీపేట: క్రీడాకారులు జాతీయ స్థాయిలో రాణించాలనే లక్ష్యంగా ముందుకు సాగాలని డీఈఓ ఎం.కమలకుమారి అన్నారు. అమలాపురానికి చెందిన రిటైర్డ్ హెచ్ఎం రంకిరెడ్డి కాశీవిశ్వనాథ్ సమకూర్చిన షూలను అంబాజీపేట జెడ్పీ హైస్కూల్‌కు చెందిన క్రీడాకారులకు బుధవారం అందజేశారు. క్రీడల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులను మరింత ప్రోత్సహించడం అభినందనీయమన్నారు. అనంతరం 13 మంది క్రీడాకారులకు షూలు అందజేశారు. కార్యక్రమంలో డీవైఈఓ పి.షాలెంరాజు, బీర హనుమంతరావు, పీఈటీ ఎ.సూర్యకుమారి తదితరులు పాల్గొన్నారు.

వెంకన్న సన్నిధిలో రిటైర్డ్ ఐఏఎస్ పద్మ

ఆత్రేయపురం: వాడపల్లి శ్రీ, భూ సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో బుధవారం సాయంత్రం దేవదాయ ధర్మదాయ శాఖ ట్రిబ్యునల్ సభ్యురాలు, రిటైర్డు ఐఏఎస్ పద్మ స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆమెకు ఆలయ చైర్మన్ రుద్రరాజు రమేష్‌రాజు, ఈవో ముదునూరి సత్యనారాయణరాజు ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం ఆలయ అర్చకులు స్వామి చిత్రపటం, ప్రసాదాలు అందించారు.

మైనర్లు నడిపితే వాహనాలను సీజ్ చేస్తాం

మలికిపురం: మైనర్లు వాహనాలు నడిపితే వాటిని సీజ్ చేస్తామని మలికిపురం ఎస్సై హరికోటి శాస్త్రి హెచ్చరించారు. బుధవారం మలికిపురంలో ఆయన వాహనాలను తనిఖీ చేశారు. అందులో మైనర్లు అధికంగా ఉన్నారు. ఇదే తొలిసారి వార్నింగ్ అని కౌన్సెలింగ్ ఇచ్చారు. ఇకపై వాహనాలను సీజ్ చేయడంతో పాటు కేసులు నమోదు చేస్తామని స్పష్టం చేశారు. మైనర్లకు వాహనాలు ఇస్తే తల్లిదండ్రులపై కూడా కేసులు నమోదు చేస్తామన్నారు. అధిక ప్రమాదాలు మైనర్ల వల్లే సంభవిస్తున్నాయని ఆయన పేర్కొన్నారు. దీని నిరోధానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు.

యువతి అదృశ్యంపై కేసు

ఆత్రేయపురం: మండలంలోని ర్యాలి గ్రామానికి చెందిన 20 ఏళ్ల యువతి అదృశ్యమైనట్లు వచ్చిన ఫిర్యాదు మేరకు బుధవారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై సీహెచ్ సుధాకర్ తెలిపారు. ఈనెల 13న గ్రామంలో ఉన్న శివాలయానికి వెళ్లి తిరిగి రాకపోవడంతో తల్లి ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.